# 'గోళ్లపాడు'లో అవినీతి కాదు.. అభివృద్ధి జరిగింది

- దమ్ముంటే అవినీతి జరిగిందని నిరూపించాలి
- అభివృద్ధి జరిగిందని ఒప్పకోలేక అనవసర నిందలు
- కరోనా సమయంలో ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్నా..
- ఖమ్మం ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, అక్టోబర్ 24 : 'నగరంలోని త్రీటౌన్ పరిధిలో గల గోళ్లపాడు చానల్‌లో అవినీతి జరిగిందంటున్న మీరు ఇన్నేళ్లు నోరెందుకు మూసుకున్నారు. ఇప్పుడు ఎన్నికలు వచ్చినందున అవినీతి జరిగిందంటున్నారు.. దమ్ముంటే నిరూపించాలి. గోళ్లపాడు చానల్‌లో జరిగింది అవినీతి కాదు.. అభివృద్ధి' అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. అభివృద్ధి జరిగిందని ఒప్పుకోవడానికి మనసు రాక ఇలా నిందలు వేస్తూ అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. ఖమ్మం నగరం 28వ డివిజన్ ప్రకాశ్ నగర్‌లో కోడి లింగయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. నాడు జై తెలంగాణ అంటే కన్నెర్రజేసి ఉద్యమకారులపై లాఠీ దెబ్బల వర్షం కురిపించిన ఘనత కాంగ్రెస్ నాయకులదని అన్నారు. ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో ఓట్లు దండుకునేందుకు ఇళ్లలో జొరబడి బలవంతంగా కండువాలు కప్పి.. ఫొటోలు వాట్సాప్‌లలో పెట్టి మద్దతు తెలిపిండని అసత్య ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ప్రకాశ్ నగర్‌కు కాంగ్రెస్ అభ్యర్థి గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో ఒక్కసారైనా వచ్చాడా చెప్పాలన్నారు. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న తొమ్మిదేళ్ల కాలంలో అనేకమార్లు ఇక్కడి ప్రజలను కలిసిన.. ప్రతి కార్యక్రమానికి వచ్చా.. వాళ్లు ఏనాడైనా వచ్చారా.. చెప్పాలన్నారు. కరోనా ఉగ్రరూపం దాల్చిన సమయంలో ప్రతి డివిజన్‌లో తిరిగి ప్రజల క్షేమ సమాచారం తెలుసుకుని, వారికి కావాల్సిన ఆక్సిజన్, రెమిడిసివర్ ఇంజెక్షన్లు, మందులు, నిత్యావసర సరుకులు, ఐసీయూలో బెడ్లు ఇలా అనేకం సమకూర్చామన్నారు. ఆ సమయంలో నాకు రెండుసార్లు కరోనా వచ్చింది.. అయినా విశ్రమించకుండా నియోజకవర్గ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్నామన్నారు. ఖమ్మం నగరంలో 8,700 మంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందించామని గుర్తు చేశారు. ఇప్పటివరకు కోట్లాది రూపాయల వ్యయంతో చేసిన అభివృద్ధి మీ కళ్ల ముందే ఉంది.. మళ్లీ మమ్మల్ని ఆశీర్వదించి వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి అందరూ ఓటు వేసి గెలిపించాలని పువ్వాడ కోరారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కార్పొరేటర్ గజ్జెల లక్ష్మీ వెంకన్న, పల్లా కిరణ్, తొట్టి ఎల్లయ్య, ముత్యాల వెంకయ్య, గజ్జెల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# వచ్చేది బీఆర్ఎస్సే.. సీఎం కేసీఆరే..

- ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు
- ఉమ్మడి చాతకొండ పంచాయతీలో ఎన్నికల ప్రచారం
- ఘనస్వాగతం పలికిన ప్రజలు


ఎమ్మెల్యేకు హారతిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 24 : వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని, మూడోసారీ సీఎం కేసీఆరే అవుతారని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఉమ్మడి చాతకొండ పంచాయతీ ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీలోని మహిళలు ఆయనకు హారతిచ్చి స్వాగతం పలికారు. పూలుచల్లుతూ గ్రామాల్లోకి ఆహ్వానించారు. ఇంటింటికీ తిరుగుతూ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ప్రచారం చేశారు.తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న, అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యేగా తనకు మరొక్కసారి అవకాశం కల్పించాలని, మరింత అభివృద్ధిని చేసి చూపిస్తానని అన్నారు. ఓటర్లే తన దేవుళ్లని, తాను పూజారిగా సేవలు చేసుకుంటానని చెప్పారు. ఈ సందర్భంగా ప్రజలు, అభిమానులు జై కేసీఆర్..జై వనమా అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# సరిహద్దులో 'తెల్లం'కు గిరిజనుల బ్రహ్మరథం

## సమ్మక్క సారలమ్మను దర్శించుకున్న తెల్లం వెంకట్రావు


తెల్లంకు స్వాగతం పలుకుతున్న గిరిజనులు


సమ్మక్క, సారలమ్మను దర్శించుకుంటున్న తెల్లం

దుమ్ముగూడెం, అక్టోబర్ 24 : ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామాలైన మారాయిగూడెం, కొత్తపల్లి, రామచంద్రునిపేట తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావుకు గిరిజనులు బ్రహ్మరథం పట్టారు. మంగళవారం ఆయన సరిహద్దు గ్రామాల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు వెళ్లగా తొలుత సమ్మక్క, సారలమ్మ గద్దె వద్దఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గిరిజనులు తెల్లంకు ఘనస్వాగతం పలికి ఆయనతో కలిసి సాంప్రదాయ నృత్యాలు చేశారు. అనంతరం మండలంలోని బొజ్జిగుప్ప, నారాయణరావుపేట, లచ్చిగూడెం, భీమవరం తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అలాగే బీఆర్ఎస్ మ్యానిఫెస్టో అంశాలను గిరిజనులకు పూర్తిగా వివరించి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తనకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. ప్రతిఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించి అందరినీ అభివృద్ధి చేస్తామని ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, కార్యదర్శి కణితి రాముడు, ఎంపీపీ రేసు లక్ష్మి, జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఉపాధ్యక్షులు తునికి కామేశ్, అపకా వీర్రాజు, దామెర్ల శ్రీనివాసరావు, సోడె తిరుపతిరావు, మడకం రామారావు, పూసం ధర్మరాజు, సర్పంచ్‌లు ఇర్పా చంటి, రజని, గుండి వెంకటేశ్, తెల్లం రామకృష్ణ, సరియం సీతారామారావు, నాయకులు దామెర్ల శ్రీనివాసరావు, అల్లాడి వెంకటేశ్, జిలకరి గంగరాజు, జెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌ను ఆదరించండి... నన్ను ఆశీర్వదించండి

## గడపగడపకూ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే మెచ్చా


ఎమ్మెల్యే మెచ్చాకు బొట్టుపెట్టి హారతులిస్తున్న మహిళలు

దమ్మపేట, అక్టోబర్ 24 : తెలంగాణ ప్రభుత్వంలో తొమ్మిదిన్నరేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన, చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలందరూ బీఆర్ఎస్‌ను ఎన్నికల్లో ఆదరించాలని... ఈ ప్రాంత ఎమ్మెల్యేగా మీకు అందించిన సేవలను గుర్తించి తనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఓటర్లను కోరారు. మంగళవారం కుటుంబ సమేతంగా మండలంలోని తాటి సుబ్బన్నగూడెం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొద్దులగూడెంలో ఏకులపోతమ్మ గుడి, వడ్లగూడెం మల్లేశ్వరస్వామి ఆలయం, గణేశ్‌పాడు విజయదుర్గ ఆలయం, మందలపల్లి షిరిడీసాయి ఆలయం, దమ్మపేట శివాలయాల్లో మనుమడు, మనుమరాలు జన్మదినం సందర్భంగా పూజలు నిర్వహించి అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. దమ్మపేటలో ఆయన గడపగడపకూ వెళ్లి ఓటర్లను కలుసుకుని మ్యానిఫెస్టోలో అంశాలను వివరించి ఓటు అభ్యర్థించారు. ఆయనకు ప్రజలు బొట్టుపెట్టి హారతులిస్తూ ఘనస్వాగతం పలికారు. ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మరింత జోష్‌తో ఎమ్మెల్యే మెచ్చాతో కలిసి ముందుకుసాగారు. పసుమర్తి విశ్వేశ్వరరావు నివాసానికి మెచ్చా వెళ్లగా 2018 ఎన్నికల్లో మీకు భగవంతుని ఫొటో ఇచ్చానని... ఎమ్మెల్యేగా గెలిచి వచ్చారని... ఈ సారి కూడా భగవంతుని ఫొటో ఇస్తున్నానని తిరిగి మంత్రిస్థాయిలో గెలిచి రావాలని చెప్పడంతో మెచ్చా తనను ఆలింగనం చేసుకుని ఆప్యాయతను చాటుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, జిల్లా రైతుబంధు సమితి కన్వీనర్ రావు జోగేశ్వరరావు, జిల్లా మైనార్టీ సెల్ నాయకులు ఎస్‌కె.సైదా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొడ్డాకుల రాజేశ్వరరావు, సర్పంచ్ ఉయ్యాల చిన్నవెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ దారా యుగంధర్, పట్టణ అధ్యక్షుడు యార్లగడ్డ బాబు, అబ్దుల్ జిన్నా, రాయల నాగేశ్వరరావు, నియోజకవర్గ యువజన నాయకులు యార్లగడ్డ శ్రీనివాసరావు, పానుగంటి చిట్టిబాబు, పగడాల రాంబాబు, పండూరి వీరబాబు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు


దమ్మపేటలో ప్రచారం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616